నష్టాలు తెచ్చిన బంతి.. చామంతి



పూల ధరలు తగ్గడంతో ఇబ్బందుల్లో రైతులు

మడకశిరరూరల్: వ్యవసాయం జూదంగా మారింది. ఆరు గాలం చమటోర్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఆహార పంటలు, వాణిజ్య, చామంతి, బంతి పూల సాగు చేపట్టిన అన్నదాతలకు లాభాల మాట అటుంచితే నష్టాలు మిగులుస్తున్నాయి. ధరలు తగ్గు ముఖం పట్టడంతో చామంతి, బంతి పూల సాగు రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు.



మడకశిరలో బంతి పూలను కోస్తున్న కూలీలు

పంట దిగుబడి వచ్చినా...

పండుగలకు పూల సాగు దిగుబడి వచ్చే విధంగా రైతులు ముద్దబంతి, చామంతి సాగు చేశారు. ఆగస్టు నెలలో ఉన్న ధరలు ఉన్న ఫళంగా తగ్గు ముఖం పట్టాయి. ఇవే ధరలు కొనసాగితే పెట్టిన పెట్టుబడి కూడా దక్కవని రైతులు వాపోతున్నారు.

బంతి, చామంతి పూల సాగు

మడకశిర నియోజకవర్గంలో ఈ ఏడాది బోరు బావుల కింద రైతులు 500 ఎకరాల వరకు చామంతి, 200 ఎకరాలకుపైగా ముద్దబంతి పూల సాగు చేశారు. పంట కోతకు వచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు తగ్గు ముఖం పట్టాయి. కిలో చామంతి రూ.50 నుంచి రూ. 60 వరకు, కిలో బంతి పూలు రూ.10 నుంచి రూ.20 వరకు మార్కెట్‌లో ధరలు ఉన్నాయి. దీంతో నష్టాలు చవి చూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి మాత్రమే వచ్చింది



అప్పులు చేసి బోరు కింద ఎకరాకు రూ.40 వేల ఖర్చు పెట్టి నాలుగు ఎకరాల్లో ముద్ద బంతిని సాగు చేశాను. పంట దిగుబడి బాగా వచ్చినా మార్కెట్‌లో ధర తగ్గిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి మాత్రమే చేతికందింది. ధర ఉంటే లక్షకు పైగా ఆదాయం వచ్చేది.

– నరసింహమూర్తి, మడకశిర మండలం



సాగులో ఉన్న చామంతి పూల తోట

తక్కువ ధరకే విక్రయించాం



నీటి సౌకర్యం ఉన్న ఎకరా భూమిని కౌలుకు తీసుకుని రూ.60 వేల ఖర్చు పెట్టి ముద్దబంతి పంటను సాగు చేశాను. పంటలో దిగుబడి బాగా వచ్చినా మార్కెట్‌లో ధర లేకపోవడంతో సాగుకు పెట్టిన ఖర్చు మాత్రమే దక్కుతోంది. వారం క్రితం రెండు టన్నుల పూలను హైదరాబాద్ మార్కెట్‌కు తరలించాం. తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చింది. ధర ఎక్కువగా ఉంటే ఆదాయం వచ్చేది.

– పశురామప్ప, కౌలు రైతు, మడకశిర

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సురేష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిల్వ ఉన్న టీకాలను పరిశీలించారు. సకాలంలో రోగులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లా కమ్యూనిటీ హెల్త్ అధికారి వన్నప్ప, సీనియర్ అసిస్టెంట్ మధు, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుడిబండ: గ్రామాల్లో రైతుల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు, స్థలాలు, గ్రామ కంఠంతో పాటు ఉమ్మడి వనరులు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించండి

మడకశిర: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రపంచ హ్యాండ్ వాష్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, మెప్మా సీఓ నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం టౌన్: నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సురక్ష యాప్‌పై మద్యం వ్యాపారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం వ్యాపారులు, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో ఉన్న మద్యం దుకాణాలు, బార్లలో శాంపిల్స్ సేకరించి కెమికల్ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్ట్‌లో రామకృష్ణప్ప అనే వ్యక్తి నుంచి 20 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నేడు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ వెహికల్ మేళా

హిందూపురం: రాష్ట్ర రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహన డీలర్ల సహకారంతో హిందూపురం చర్చి గ్రౌండ్‌లో గురువారం 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ వెహికల్ మేళా' నిర్వహిస్తున్నట్లు ఆర్టీఓ అధికారులు తెలిపారు. వాహనాల కొనుగోలుపై 28 శాతం నుంచి 18 శాతం జీఎస్టీ తగ్గింపును మేళా ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. పలు వాహనాల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు.

నెగ్గిన అవిశ్వాస తీర్మానం



చేతులెత్తి అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపుతున్న సభ్యులు

పావగడ: తాలూకాలోని సీకే పురం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అరుంధతికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏసీ గోటూరు శివప్ప నేతృత్వంలో బుధవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మొత్తం 15 మంది సభ్యుల్లో 12 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు.

పాలిటెక్నిక్ కళాశాలలో చోరీ

హిందూపురం: పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఓ గదిలోని బాత్‌రూమ్ కిటికీ కొక్కీలు వంచి లోపలికి ప్రవేశించిన దొంగ ట్యాబ్, సెల్‌ఫోన్‌తో పాటు రూ.1600 నగదు ఎత్తుకెళ్లాడని కళాశాల ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సీఐ రాజగోపాల్‌నాయుడు కళాశాలను పరిశీలించి భద్రతా చర్యలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. హాస్టల్‌లోని గదుల్లోకి దొంగ ప్రవేశచడంతో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బట్నా కృష్ణారావు

గోరంట్ల: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పాలసముద్రంలోని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బట్నా కృష్ణారావు అన్నారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో ఆయన హాఫ్ ఇయర్లీ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. 60 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి అదనంగా మరో గంట పాటు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వచ్చేందుకు నాసిన్ 2వ గేటు వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో ఇబ్బంది కలుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు బాగు చేయిస్తామన్నారు.

యత్తప్పస్వామికి క్షీరాభిషేకం



అలంకరణలో యత్తప్పస్వామి

రొళ్ల: మండల పరిధిలోని జీజీ హట్టిలో వెలసిన యాదవుల ఆరాధ్య దేవుడు యత్తప్పస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా వుండగా... గురువారం పాలు పోసే పండుగను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తనూ గుర్తిస్తాం





లేపాక్షి : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, హిందూపురం: డిజిటల్ బుక్ క్యూఆర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దీపిక, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

లేపాక్షి: 'పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తాం. గ్రామ కమిటీల్లో చోటు కూడా కల్పిస్తాం' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్. దీపికా అన్నారు. బుధవారం మండలంలోని కొండూరులో పార్టీ మండల కన్వీనర్ నిస్సార్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పార్టీ కమిటీల్లో ఎన్నుకున్న వారు అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ కార్యకర్తలకు బలం

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ కొండంత బలమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక అన్నారు. హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లేపాక్షి మండల నాయకులతో కలిసి ఆమె డిజిటల్ బుక్ క్యూఆర్ పోస్టర్లను ఆవిష్కరించారు. దీపిక మాట్లాడుతూ టీడీపీ నేతలు చేస్తున్న అరాచకాలు, అకృత్యాలను డిజిటల్ బుక్‌లోకి అప్‌లోడ్ చేయాలని, వచ్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డిజిటల్ బుక్‌ను ఓపెన్ చేసి చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజనోరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లన్న, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రవీంద్రరెడ్డి, బోయ రామాంజి, తిప్పన్న, శ్రీరాములు, లలిత, విజయ్‌కుమార్, నాగిరెడ్డి, తన్సీర్, చాంద్, మైలరప్ప, అశోక్, నరసింహులు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కలాం జీవితం అందరికీ ఆదర్శం



బీఐటీ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని గుడ్డంపల్లిలోని బీఐటీ కళాశాల ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవలు, ఆలోచనలు విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో బుధవారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. అలాగే పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సత్య సాయి జూనియర్, డిగ్రీ కళాశాలలో కలాం జయంతి వేడుకలు జరుపుకున్నారు.

పెనుకొండ రూరల్: భారతరత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్ మూర్తి, ఎమ్మార్పీఎస్ రామాంజినేయులు, ఏపీజే అబ్దుల్ కలాం సొసైటీ సభ్యులు జాఫర్‌వలి, పాన్ భాషా, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ శేషాద్రి, కిష్టా, మాజీ సర్పంచ్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గురువారం కర్నూలులో ప్రధాన మంత్రి సభ జరుగనుంది. ఈ నేపథ్యంలో మడకశిర డిపో పరిధిలోని దాదాపు 95 శాతం బస్సులను సభకు జనాన్ని తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సేవలు నియోజకవర్గవ్యాప్తంగా నిలిచి పోయాయి. మడకశిర డిపో పరిధిలో దాదాపు 30 బస్సులు ఉన్నాయి. ఇందులో దాదాపు 25 బస్సులను జనాన్ని తరలించడానికి కేటాయించారు. పల్లె వెలుగు బసులన్నీ కేటాయించడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రొద్దం: రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



పరిగి: క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండలంలోని బీచిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఈనెల 13న అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 19 విభాగంలో జరిగిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఆటల పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ప్రిన్స్, పదో తరగతి విద్యార్థి రాజేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో పీడీ ఆదినారాయణ, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

రొద్దం: మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న శంకర్, సూర్య రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు, 9వ తరగతి హరీష్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం హరికిరణ్, పీడీ మహేశ్ బుధవారం తెలిపారు. గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సమ్మె నోటీసిచ్చిన కార్మికులు



సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు, కార్మికులు

పెనుకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజినేయులు డిమాండ్ చేశారు. నవంబర్ 3 నుంచి ఏపీ మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెకు పిలుపిచ్చిందన్నారు. బుధవారం కార్యాలయంలో సమ్మె నోటీసులు అందించిన అంజినేయులు, కార్మికులు తమ డిమాండ్ల పరిష్కరించాలని కోరారు. డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, కరణ్ , గజేంద్ర, నరసింహులు, బావక్క, శాంతమ్మ పాల్గొన్నారు.

భవనాలున్నా నిరుపయోగం



ముళ్ల కంచెల మధ్య ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



నిరుపయోగంగా మారిన శ్రీ నిధి భవనం

అగళి: ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. లక్షలు వెచ్చించి మండల కేంద్రంలో నిర్మించిన అంగన్‌వాడీ, శ్రీనిధి భవనాలను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. దాదాపు 13 ఏళ్ల క్రితం వీటిని నిర్మించారు. మండలంలో 871 మహిళా సంఘాల్లో 8,963 మంది మహిళలు ఉన్నారు. 34 మంది ఆనిమేటర్లు పనిచేస్తున్నారు వీరికి సరైన భవన వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే మండల కేంద్రంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రెండు ప్రభుత్వ భవనాలు ఉండగా అందులో ఒకటి శిథిలావస్థకు చేరింది. దీంతో మూడు అంగన్‌వాడీ సెంటర్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. శ్రీనిధి భవనం అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవనాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం: గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ డిమాండ్ చేశారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ప్రతినిధులతో గురువారం జరిపే చర్చల్లో దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని జేఏసీ నాయకులను కోరుతున్నామన్నారు.

టపాసుల షాపుల నిర్వాహకులతో సమావేశం

లేపాక్షి: దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలికంగా టపాసుల షాపుల నిర్వహించడం కోసం బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి క్రాకర్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సూచనలు చేశారు. మండలంలో క్రాకర్స్ షాపుల నిర్వహణకు 7 దరఖాస్తు వచ్చాయని, అందులో నాలుగు దరఖాస్తులకు ఆమోదం తెలిపామని తహసీల్దార్ తెలిపారు.

కొల్లాపురదమ్మకు పూజలు



అలంకరణలో కొల్లాపురమ్మ

గుడిబండ: మండల పరిధిలోని నాగేపల్లిలో కొల్లాపురమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, మాజీ ఎమ్మెల్యే, సీఈసీ సభ్యుడు తిప్పేస్వామి, పార్టీ నాయకులు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

అమరాపురం: మండలంలోని ప్రజలు తమ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐకేపీ ఏపీఎం ముత్యాలప్ప సూచించారు. బుధవారం స్థానిక సింధూ గ్రామైక్య సంఘం కార్యాలయ ఆవరణలో మహిళా సంఘాల సభ్యులకు ప్రపంచ చేతుల పరిశుభ్ర దినోత్సవం సందర్భంగా చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు.

మన డబ్బులు మన లెక్కలుపై ర్యాలీ

స్థానిక ఐకేపీ కార్యాలయంలో మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమంపై మహిళా సంఘాల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఐకేపీ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

హిందూపురం టౌన్: ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఏఐఎస్ఎఫ్ మాజీ విద్యార్థి సంఘం నాయకుడు వినోద్ కుమార్, ఎస్ లైట్ ఐకాన్ కరస్పాండెంట్ సురేష్, ఐకాన్ ప్రిన్సిపల్ బైరిశెట్టి, నాయకులు చంద్రశేఖర్, తేజ, గౌరీ శంకర్, కిరణ్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

అగళి: మండల వ్యవసాయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో మండలంలో రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి పంటల కోతకు సంబంధించిన ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నాగరాజు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పంట కోత ప్రయోగాలు పూర్తి జాగ్రత్తతో నిర్వహించాలన్నారు. వివిధ సూచనలు, సలహాలిచ్చారు.

బాధితులకు కిట్ల పంపిణీ

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద ఉత్తర కర్ణాటక జిల్లాలోని పలు వరద బాధిత ప్రాంతాలలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా యాదగిరి జిల్లా శహాపుర తాలూకా హురసనగుండగి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వరద బాధితులకు పరిహార యోజన కింద నిత్యావసర కిట్లను బుధవారం అందించారు. ఆహార పదార్థాలు, వస్త్రాలను పంపిణీ చేశారు.